
ఉపాధ్యాయుడి వెకిలి చేష్టలు

- బాలికల పట్ల అసభ్య ప్రవర్తన
- తల్లిదండ్రుల ఆందోళన.. సస్పెండ్ చేసిన డీఈవో

5లో...



దెబ్బతిన్న తుఫాన్ వాహనం



గుంజల్లి సుజయీంద్ర (ఫైల్)



హయవదన (ఫైల్)



అభిలాష (ఫైల్)



డ్రైవర్ కంసాలి శివ (ఫైల్)



గాయపడిన సంస్కృత విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న లింగసూగూరు డీఎస్పీ దత్తాత్రేయ కర్నాడు

కన్నీటి వేదన

- కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం
- ముగ్గురు సంస్కృత పాఠశాల విద్యార్థులతోపాటు డ్రైవర్ మృతి
- సీఎం, డిప్యూటీ సీఎంల దిగ్ర్భాంతి
- బాధిత కుటుంబాలకు కర్ణాటక సీఎం ఆర్థిక సాయం
- కన్నీరు పెట్టుకున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

వేద పాఠాలు నేర్చుకోవాల్సిన విద్యార్థుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. తమ బిడ్డలు గొప్ప పండితులుగా తయారై బయటకు వస్తారనుకున్న తల్లిదండ్రుల ఆశలు ఆవిరయ్యాయి. నరహరితీర్థుల ఉత్తరారాధన పూజల కోసం మంత్రాలయం నుంచి కర్ణాటకకు బయలుదేరిన ముగ్గురు వేద విద్యార్థులను తుఫాన్ వాహనం రూపంలో మృత్యువు వెంటాడింది. వాహనం ఎక్సెల్ విరిగిపోవడంతో మూడు పల్టీలు కొట్టింది. ముగ్గురు వేద విద్యార్థులు మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది.

సంస్కృత పాఠశాలలో విషాదం నెలకొంది. అయ్యో.. బిడ్డా.. అప్పుడే నూరేళ్లు నిండాయా అంటూ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు అందరినీ కంట తడిపెట్టించింది. ఇదే ఘటనలో డ్రైవర్ కూడా మృత్యు వాతపడడంతో ఆ కుటుంబంలోనూ విషాదం నెలకొంది. నలుగురి కొడుకుల్లో ఇప్పటికే ఒకరు మృతి చెందాడని, ఇప్పుడు ఇంకో కొడుకు మృతి చెందాడని, తాము ఎవరి కోసం బతకాలని డ్రైవర్ తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు.

మిగతా 5 పేజీలో...



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

జేఈఈ-మెయిన్ ప్రవేశ పరీక్ష ఆరంభం



పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జాతీయ విద్యాసంస్థల్లో బీటెక్, బీఆర్క్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ-మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్ష బుధవారం ప్రారంభమైంది. ఈ పరీక్ష ఈ నెల 30వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో కొనసాగుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జరిగింది. కర్నూలు నంద్యాల రోడ్డులోని సనత్‌నగర్‌లో ఉన్న అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా సమయం కంటే రెండు గంటల ముందే కేంద్రానికి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, బంధువులు చేరుకున్నారు. నిర్వాహకులు మెయిన్ గేటు వద్ద విద్యార్థులు చెక్ చేసి పరీక్ష కేంద్రం లోనికి అనుమతించారు. విద్యార్థుల సౌకర్యార్థం సెల్‌ఫోన్లను, బ్యాగ్‌లను డిపాజిట్ చేసుకునేందుకు లాకర్లను ఏర్పాటు చేశారు.

సమన్వయంతో పని చేయండి

- మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఏ లోటూ రాకూడదు
- సంతృప్తికరమైన దర్శనాన్ని కల్పించాలి
- పాదయాత్రికులకు ప్రత్యేక సేవలు
- అటవీ చెక్‌పోస్టుల్లో రుసుముకు మినహాయింపు
- ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు
- నంద్యాల కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారీ

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఏలోటు రానివ్వకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం శ్రీశైలంలోని అన్నదాన వితరణ ప్రాంగణంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవస్థానం ఈవో శ్రీనివాసరావుతో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. శాఖల వారీగా సమీక్షించి అవసరమైన ప్రతిపాదనలను దేవస్థానం ఈవోకు నివేదిస్తే ఏర్పాట్లపై దృష్టి సారిస్తామన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున దేవస్థానం, పోలీసు శాఖతో మిగతా శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో వ్యవహరించి భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని ఆదేశించారు. ప్రత్యేకించి భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కలిగేలా చూడాలని, శీఘ్ర దర్శనానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు మంచినీరు, పాలు, అల్పాహారం సమకూర్చాలని తెలిపారు. అదేవిధంగా పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి దాదాపు 800 బస్సులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పటిష్టమైన ప్రణాళికలతో పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. రహదారి మార్గంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. హెల్ప్ డెస్క్, కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు భక్తులకు సమాచారం అందించాలని అన్నారు. శానిటేషన్ సమస్య ఉత్పన్నం కాకుండా మూడు షిఫ్ట్‌ల్లో మురికికాల్వలను శుభ్రం చేయించాలని అన్నారు.

మిగతా 4వ పేజీలో...

మున్సిపల్ చైర్మన్ హల్‌చల్

- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్



కోటా వీధిలోని తిక్కయ్య ఇంటి వద్ద వాగ్వివాదానికి దిగిన చైర్మన్

నందికొట్కూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి హల్‌చల్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం నందికొట్కూరు పట్టణంలో ఓ ఇంటి వద్దకు వెళ్లి బాల్కాని తొలగిస్తే ఎవడు ఆపుతారంటూ విరుచుకుపడిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. పట్టణంలోని కోటా వీధికి చెందిన తిక్కయ్య అనే వ్యక్తి ఇంటి పక్కన భాస్కర్ రెడ్డి ఉంటున్నారు. అక్కడే ద్విచక్ర వాహనాన్ని నిలిపి తన ఇంటికి వెళ్తుండగా తమ ఇంటి వద్ద ఎందుకు బైక్ పార్కింగ్ చేస్తారని చెప్పడంతో వాదోపవాదాలు జరిగి ఘర్షణ చోటు చేసుకుంది. భాస్కర్‌రెడ్డి చైర్మన్ గోదాములో పని చేస్తారు. ఘర్షణ విషయం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డికి తెలియడంతో ఆయన రంగంలోకి దిగారు. దంతో 'మీ ఇంటి ముందు కాదుకాదా...పక్కన మున్సిపాలిటీకి చెందిన రోడ్డుపైన బండి పార్కింగ్ చేస్తే మీకేమవుతుంది.. మీ ఇంటి బాల్కాని కూడా మున్సిపాలిటీ స్థలంలోకి వచ్చింది. రేపు జేసీబీతో పడగొడితే ఎవడు వస్తాడు' అని నిప్పులు చెరిగారు. ఇరు వర్గాల వారిని కొందరు వారించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది.

చిరుత సంచారం

మహానంది, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంసీ ఫారంలోని వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానానికి చెందిన మామిడి తోటలో బుధవారం చిరుత సంచారం కలకలం రేపింది. పొలాల్లో పనులు చేస్తుండగా సమీపంలోని మామిడి తోటలో చిరుతపులి కనిపించడంతో భయాందోళనతో పరుగెత్తినట్లు కూలీలు తెలిపారు. ఇటీవల మహానంది పరిసరాల్లో చిరుత సంచారం తగ్గిందనుకున్న సమయంలో మళ్లీ చిరుత పులి కనిపించింది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రాణహాని జరగకముందే చిరుతపులిని అటవీ అధికారులు బంధించాలని కోరుతున్నారు.

పత్తి జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్ వల్ల చెలరేగిన మంటలు
- పరుగులు తీసిన హమాలీలు, రైతులు
- రూ.10 కోట్లకు పైగా పత్తి, దూది, ఆస్తి నష్టం
- రాత్రి వరకు అదుపులోకి రాని మంటలు
- ఆర్ఎఫ్ఓ, డీఎఫ్ఓల పర్యవేక్షణలో సహాయక చర్యలు





జిన్నింగు మిల్లులో కాలిపోతున్న పత్తి

ఆదోని అగ్రికల్చర్/కర్నూలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతోష్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ టీఎంసీ పరిశ్రమలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో హమాలీలు, కూలీలు భోజనాలు చేస్తున్నారు. మిల్లు మధ్యలో విద్యుత్ తీగలకు ఎక్స్‌కలేటర్ తగిలి షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది ఆర్పే ప్రయత్నాలు చేశారు. వందల టన్నులు పత్తి, దూది బేళ్లు ఉండడంతో క్షణాల్లో మంటలు మిల్లు మొత్తం వ్యాపించాయి. హమాలీలు, కూలీలు, రైతులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. దాదాపుగా రూ.10 కోట్ల నష్టం జరిగింది. ఆదోని పత్తి మార్కెట్ యార్డు సమీపంలోని సంతోష్ టీఎంసీ పత్తి జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమలో బుధవారం హమాలీలు, కూలీలు బిజీగా ఉన్నారు. వివిధ గ్రామాల నుంచి పత్తి తీసుకొచ్చిన రైతులు కూడా ఉన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మిల్లు మధ్యలో ఉన్న ఎక్స్‌కలేటర్.. పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలి, షార్ట్ సర్క్యూట్ ఏర్పడి నిప్పు రవ్వలు పత్తి, దూదిపై పడ్డాయి. పత్తి, దూది, దూదిబేళ్లు పెద్ద సంఖ్యలో నిలువ ఉండడంతో నిప్పు రవ్వలు పడగానే మంటలు చెలరేగాయి. మిల్లులో ఉన్న అగ్నిమాపక పరికరాలతో మంటలు ఆర్పేందుకు హమాలీలు, సిబ్బంది ప్రయత్నించారు. అయినా క్షణాల్లో మంటలు మిల్లు మొత్తాన్ని వ్యాపించి ఉవ్వెత్తున ఎగశాయి. హమాలీలు, కూలీలు, సిబ్బంది, రైతులు ప్రాణభయంతో పరుగులు బయటకు పరుగులు తీశారు. మిల్లు అంతా దట్టమైన పొగ అలుముకుంది.

(మిగతా 5వ పేజీలో...)

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట

- లైంగిక నేరాలు అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు
- త్వరలోనే సీఐలకు పదోన్నతులు
- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు



మాట్లాడుతున్న డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

కర్నూలు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని నేరాలను అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని డీజీపీ సీహెచ్ ద్వారక తిరుమలరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియం వద్ద పోలీసుల నుంచి డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. ఆడిటోరియం ఎదుట మొక్కలు నాటారు. అనంతరం డీజీపీని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ జి.బిందుమాధవ్ శాలువాతో సన్మానించి, నటరాజ విగ్రహ జ్ఞాపికను అందజేశారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఇన్‌విజిబుల్ పోలీస్‌తో విజిబుల్ పోలీసింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులను ఎక్కువ శాతం రోడ్ల మీదకు పంపకుండా టెక్నాలజీ ఉపయోగించుకునేలా చేస్తున్నామని తెలిపారు. బార్డర్‌లో ఎలాగైతే కనిపించని సైనికులు పని చేస్తుంటారో.. అలాగే ఇన్‌విజిబుల్‌తో పోలీసింగ్ చేయాలని సూచించారు. నేరాల తీవ్రత తగ్గించాలని, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను అరికట్టాలని పోలీసులను ఆదేశించారు. విరివిగా సీసీ కెమెరాలు, బాడీవోన్స్ కెమెరాలు, వజ్ర, ఫాల్కన్ వాహనాలతో నేరాలు అరికట్టాలన్నారు. సైబర్ నేరాలను కట్టడి చేయాలని, ప్రతి బాధితుని నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాల పట్ల ఉక్కుపాదం మోపేందుకు వెనుకాడవద్దని ఆయన ఆదేశించారు. ఇందు కోసం ప్రత్యేకంగా పోలీసు బృందాలు ఏర్పాటు చేసి నేరాలను ఛేదించాలని సూచించారు. పోక్సో యాక్టు కేసును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీఐలకు డీఎస్పీలుగా త్వరలో పదోన్నతులు కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏఎస్పీ ట్రైనీగా జిల్లాలో పని చేశాన న్నారు. ఏఎస్పీ ట్రైనీగా పని చేసిన విషయాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో కొత్త కొత్త నేరాలు వెలుగులోకి వస్తున్నాయని, వాటిని అరికట్టడంపై జిల్లా పోలీసులతో సమీక్షించామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే పోలీసు యంత్రాంగం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం.మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్ పీరా, డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, హేమలత, భాస్కర్ రావు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు, ఆర్ఐలు ఉన్నారు.

రైతు ఆత్మహత్య 5

రూ.291.67 కోట్లతో నగర పాలక సంస్థ బడ్జెట్ 4

అరటి సాగులో రికార్డు

ఆదర్శంగా నిలిచిన చాగలమర్రి రైతు



డీజీపీ ద్వారకా తిరుమలరావుతో నంద్యాల జిల్లా పోలీసు యంత్రాంగం



కర్నూలులో మాట్లాడుతున్న డీజీపీ

త్వరలో పదోన్నతులు

- నేరాల నియంత్రణలో పోలీసుల పని తీరు భేష్
- డీజీపీ ద్వారకా తిరుమలరావు

నంద్యాల క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో త్వరలో పదోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నామని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. ప్రస్తుతం అర్హత గల సీఐలకు డీఎస్పీలుగా, డీఎస్పీలకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో పోలీసుల పనితీరు భేషుగ్గా ఉందన్నారు. నంద్యాల జిల్లా పోలీస్ అధికారులతో రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా డీజీపీ నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకోగానే కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. డీజీపీ సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ యంత్రాంగంతో డీజీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా నంద్యాల జిల్లా ఎస్పీ నంద్యాల జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలను డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ వివిధ రకాల నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. నేరాల నియంత్రణలో పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తంగా నేరాల సంఖ్య తగ్గిందన్నారు. ప్రస్తుతం నేరాలు అదుపులో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీస్ అధికారులు, సిబ్బంది సైబర్ నేరాలు, ముఖ్యమైన కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, నేరాల నియంత్రణకు ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబద్ధతతో పనిచేసి జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అసాంఘిక శక్తులను అడ్డుకునేందుకు టెక్నాలజీని వినియోగించాలనే ఉద్దేశంతోనే డ్రోన్స్, సీసీ కెమెరాలు వాడుతున్నామన్నారు. నేరాలు జరిగే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరస్తులను కనుగొనేందుకు సులభతరమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ఫింగర్‌ప్రింట్ యూనిట్ బలోపేతం చేయడం ద్వారా వివిధ రకాల కేసుల్లో నేరస్తులను కనుగొని కేసులను ఛేదిస్తున్నామన్నారు. క్రైమ్ డిటెక్షన్‌లో సీసీ ఫుటేజ్ ఆధారాలు చాలా కీలకపాత్ర పోషిస్తాయని, వీటి కోసం రాష్ట్రంలో 18 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరో లక్ష కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ వివరించారు. కార్యక్రమంలో డీఐజీ, ఎస్పీలతోపాటు అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల ఎస్‌డీపీవో మంద జావళి ఆల్ఫోన్స్, డీఎస్పీలు రవికుమార్, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచండి

- సంక్రాంతికి రూ.23.70 కోట్ల రాబడి
- ఈనెల చివరిలోగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం
- ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు వెల్లడి

కర్నూలు రూరల్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో వ్యయాన్ని తగ్గించి.. ఆదాయాన్ని పెంచాలని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఆ శాఖ ఉద్యోగులకు సూచించారు. తాను ఆర్టీసీ ఎండీగా చార్జ్ తీసుకొని దాదాపు 44 నెలలు కావస్తోందని, ఈక్రమంలో కార్పొరేషన్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చానని వివరించారు. బుధవారం కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఆర్టీసీ కర్నూలు-1డిపో గ్యారేజీలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండుగకు రూ.23.70 కోట్ల దాకా కార్పొరేషన్‌కు ఆదాయం తీసుకవచ్చి ఆర్టీసీ చరిత్ర సృష్టించిందని అన్నారు. ప్రమాద బీమా సీపీఎస్‌కు అంతకముందు రూ.30 లక్షలు మాత్రమే ఉండేదని, తాను వచ్చిన తర్వాత కోటి రూపాయల వరకు పెంచానని అన్నారు. ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించామన్నారు. పాత అప్పులన్నీ కార్పొరేషన్ చెల్లిస్తుందన్నారు. ఆర్టీసీలో కారుణ్య నియమాకాలను చేపట్టి చనిపోయిన ఉద్యోగ కుటుంబాలను పరోక్షంగా ఆదుకున్నామన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో మిగిలిన అరియర్స్ 25శాతం చెల్లిస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను ఈ నెల చివరిలోపు పరిష్కరిస్తానని వెల్లడించారు. ఆర్టీసీ మనుగడ, అస్తిత్వం ప్రయాణికులపై ఆధారపడి వుందని, వారికి మంచి సేవలను అందించి సంస్థను మరింత అభివృద్ధిలోకి తీసుకరావాలని అన్నారు. అంతకముందు కర్నూలు-1డిపో గ్యారేజీలో ఎండీ ద్వారకా తిరుమలరావు మొక్కలు నాటారు. ఆయన వెంట కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ బిందుమాధవ్ ఉన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఈడీ పైడీ చంద్రశేఖర్, ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, సీఎంఈ హరిబాబు, డిపో మేనేజర్లు సర్దార్ హుస్సేన్, సంధ్యారాణి, ఎన్ఎంయూ, ఈయూ నాయకులు ఆర్టీసీ సిబ్బంది, పాల్గొన్నారు.

రంగోత్సవం పోటీలు

- విజేతలకు బహుమతి ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ డా.ఎన్.అయూబ్ హుశేన్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాండ్రపాడు జిల్లా విద్యా శిక్షణ సంస్థలో బుధవారం జిల్లా స్థాయి రంగోత్సవం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులు 45 మంది వివిధ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ డా.ఎన్. అయూబ్ హుశేన్ బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఏపీ, పంజాబ్ రాష్ట్రాల నుంచి క్విజ్ పోటీల్లో మొదటి బహుమతి ఎం శీఫామహావిష్, ద్వితీయ బహుమతి ఎస్. పూజ, తృతీయ బహుమతి మహ్మద్ షఫీ, డ్రాయింగ్, కాంపిటీషన్‌లో భారత స్వాతంత్ర సమరయోధుల చిత్రాల్లో ప్రథమ బహుమతి కే విశాల్, ద్వితీయ బహుమతి కే చరదీపిక, తృతీయ బహుమతి అరీఫ్ అహ్మద్, చేతిరాత (తెలుగు, ఇంగ్లీషు) పోటీల్లో ప్రథమ బహుమతి ఎ. హర్షిత (తెలుగు), ద్వితీయ బహుమతి ధర్మతేజ, తృతీయ బహుమతి ఏ. జానకి, ఇంగ్లీషు మీడియంలో ప్రథమ బహుమతి కే శిరీష, ద్వితీయ బహుమతి జయశ్రీ సాయిమీనాక్షి, తృతీయ బహుమతి లెనిన్ కుమార్, రంగోలి పోటీల్లో ప్రథమం జి.అక్షరశ్రీ, రెండో బహుమతి కే.పావని గెలుచుకున్నారు. ఆంధ్రప్రదేశ్, పంజాబ్ ఫోక్ డ్యాన్స్ కాంపిటీషన్‌లో మొదటి బహుమతి సమీర, రెండో బహుమతి ఎ. సాయి, డిజిటల్ కోలార్జ్ (యూనిట్, ఇంటిగ్రేటెడ్ పోస్టల్) ఎంకే ఆదిత్య ప్రథమ బహుమతి, ఎ. రవితేజ రెండో బహుమతి, స్లోగన్ రచనల్లో శ్రేష్ట భారత్‌లో ప్రథమ బహుమతి గీతాన్విత, రెండో బహుమతి కే మాధవి సొంతం చేసుకున్నారు. రోల్‌ప్లే (భారత దేశ సంస్కృతి చరిత్ర, విలువలు) పోటీలో హసీఫా, పి. యాస్మిన్, టి. అభినవ్ గెలుపొందారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి, శిక్షణా శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు నగరంలోని బీ.క్యాంపు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కాలేజీలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అన్నారు. ఎల్‌అండ్ టీ, టాటా, కేఎల్ గ్రూప్ సంస్థలు పాల్గొంటాయని అన్నారు. పదో తరగతి నుంచి పీజీ చదివినవారు, 35 సంవత్సరాలలోపు ఉన్న వారు అర్హులని అన్నారు. జాబ్‌మేళాలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు రూ.18వేలు జీతం ఉంటుందన్నారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 905952 4482, 7780478910 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సుకన్య సమృద్ధి ఖాతాపై ప్రత్యేక డ్రైవ్

కర్నూలు న్యూసిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో సుకన్య సమృద్ధి ఖాతాపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసులలో నిర్వహించే డ్రైవ్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాలికల ప్రయోజనార్థం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి ఖాతా 10 సంవత్సరాలలోపు బాలికలందరకీ రూ.250 నామమాత్రపు రుసుముతో దగ్గరిలోని పోస్టాఫీసుల్లో ఖాతా తెరవవచ్చన్నారు.

డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాలను ఉప కులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ విడుదల చేశారు. బుధవారం ఉపకులపతి తన చాంబర్‌లో పరీక్షల విభాగం డీన్‌తో కలిసి ఫలితాలను విడుదల చేశారు. 856 మంది పరీక్షలు రాయగా 574 మంది ఉత్తీర్ణత సాధించారని, 67 శాతం నమోదైందని పరీక్షల విభాగం డీన్ కే. నాగరాజు శెట్టి తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఫిబ్రవరి 3లోపు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ కే బాలసుబ్రమణ్యం, జూనియర్ అసిస్టెంట్ పి. వెంకటరమణయ్య పాల్గొన్నారు.

26న క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్‌ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేథ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

ప్రగతి సాధించాలి

-నీతి అయోగ్ అడిషనల్ మిషన్ డైరెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్ష హార్ట్ కార్యక్రమాలపై పూర్తి వారాంతపు కార్యక్రమాన్ని రూపొందించుకుని ప్రగతి సాధించాలని నీతి అయోగ్ అడిషనల్ మిషన్ డైరెక్టర్ మహేంద్ర కుమార్ అధికారులను సూచించారు. జిల్లాలోని మూడు ఆస్పిరేషన్ బ్లాకులైన హోళగుంద, చిప్పగిరి, మద్దికెరలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ మ్యాపింగ్‌పై బుధవారం అధికారులతో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

(3వ పేజీ తరువాయి)

దోమల నియంత్రణకై ఫాగింగ్ యంత్రాలను వినియోగించాలన్నారు. కాలినడకన తరలివచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి మందులను అందుబాటులో ఉంచాలన్నారు. భీమునికొలను, కైలాసద్వారం ప్రాంతాల్లో ప్రమాదానికి గురైై బాధితుల కొరకు స్ట్రచర్లను, అంబులెన్స్‌లను సిద్ధం చేయాలన్నారు. హోటళ్లలో విక్రయించే తినుబండాల శాంపిల్స్ సేకరించి తనిఖీ చేసి, ధరల పట్టికలను ఏర్పాటు చేయించాలని సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ అధికారులను ఆదేశించారు. నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేందుకు జనరేటర్లను సమకూర్చుకోవాలన్నారు. శ్రీశైలం మార్గంలో ఉండే అటవీ చెక్‌పోస్టుల్లో వాహనాలకు రుసుము మినహాయిస్తున్నట్లు తెలిపారు. అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ.. సుమారు 3వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అన్ని సదుపాయాలు కల్పించాలి

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గతంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లను గుర్తించి వాటిని సరిచేసుకోవాలని సూచించారు. అటవీ, పోలీసు శాఖల సమన్వయమై సాక్షిగణపతి సమీపంలో ట్రాఫిక్‌జామ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనాన్ని కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో శ్రీశైలం సబ్ డీఎఫ్‌ఓ మహ్మద్ అన్వర్‌అలీ, సబ్ కలెక్టర్ సాదిక్ త్రివినాధ్, ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, ఆర్డీవో నాగజ్యోతి పాల్గొన్నారు.

పని విభజనపై సబ్ కమిటీ ఏర్పాటు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ అధికారి జయలక్ష్మి
- హాజరైన కలెక్టర్, జేసీ, ఇన్‌చార్జి డీఆర్వో



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో అధికారాల పంపిణీ, పని విభజన, బాధ్యతలను రివైజ్ చేయాల్సి ఉందని, ఈ అంశాన్ని అధ్యయనం చేసేందుకు గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లతో సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు సీసీఎల్ఏ అధికారి జయలక్ష్మి తెలిపారు. విజయవాడ నుంచి కలెక్టర్లతో సీసీఎల్ఏ అధికారుల పంపిణీ పని విభజన అంశాలపై గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్, జేసీ, డీఆర్వో, సబ్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల స్థాయిలో అధికారాల పంపిణీ, పని విభజన, బాధ్యతలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సబ్ కమిటీలో ఉన్న గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ డా.బి.నవ్య, ఇన్‌చార్జి డీఆర్వో బీకే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.291.67 కోట్లతో

నగర పాలక సంస్థ బడ్జెట్

కర్నూలు న్యూసిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర పాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను బుధవారం స్థాయి సంఘం ఆమోదించింది. నగర పాలక కార్యాలయంలో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. రూ.291.67 కోట్లతో బడ్జెట్ రూపకల్పన చేశారు. మొత్తం ఆదాయం రూ.363.99 కోట్లు, ఖర్చు రూ.291.67 కోట్లు, రెవెన్యూ ఆదాయం రూ.201.22 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.162.77 కోట్లు, మూలధన రాబడి రూ.138.69 కోట్లు, నికర మిగులు రూ.72.31 కోట్లుగా అంచనాలు తయారు చేశారు. అదే విధంగా రెండు తీర్మానాలకు స్థాయి సంఘం ఆమోదం తెలిపింది. అమృత్-2 పథకంలో భాగంగా 19వ వార్డులోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ పబ్లిక్ పార్కు, 45వ వార్డులోని టీచర్స్ కాలనీ పబ్లిక్ పార్కుల నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాలకు కేటాయించి ఏడాది కాలానికి ఒక్కో పార్క్‌కు రూ.4.90 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. 200 మంది తాత్కాలిక పారిశుధ్య కార్మికులకు గత ఏడాది డిసెంబరు 17 నుంచి ఈ ఏడాది జనవరి 31 నాటికి రూ.42.93 లక్షల వేతనాలు చెల్లింపునకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, సభ్యులు జుబేర్, యూనుస్, క్రాంతి కుమార్, మిద్దె చిట్టెమ్మ, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, అకౌంట్స్ అధికారి చుండీ ప్రసాద్, ఆరోగ్య అధికారి కే. విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్వోలు జునైద్, ఇజ్రాయేలు, టీపీఆర్వో వెంకటలక్ష్మి, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, అకౌంట్స్ అధికారులు శభానా, మల్లికార్జున, క్లర్క్ జీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

12వ రోజు 286 మంది ఎంపిక



లాంగ్ జంప్‌లో పాల్గొన్న అభ్యర్థి

కర్నూలు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు బుధవారం 12వ రోజు కొనసాగింది. స్థానిక ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలను ఎస్పీ జి. బిందుమాధవ్ పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 415 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ, ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 323 మంది, 100 మీటర్ల పరుగులో 190 మంది, లాంగ్‌జంప్‌లో 281 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 12వ రోజు 286 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న మంత్రి

- ప్రమాదంలో గాయపడ్డ మహిళను ఆసుపత్రిలో చేర్చిన బీసీ
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు



గాయపడిన మహిళకు వైద్యం చేయిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పాణ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందించారు. బుధవారం హైదరాబాదు నుంచి బనగానపల్లెకు తన వాహనంలో వెళ్తుండగా తమ్మరాజుపల్లె ఘాట్‌లో పాణ్యం మండలం కొనిదేడు గ్రామానికి చెందిన సరస్వతి, మరో వ్యక్తి మోటారు సైకిల్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడినట్లు గమనించారు. వెంటనే తన ఎస్కార్టు వాహనంలో మహిళను తీసుకువెళ్లి పాణ్యంలోని సీహెచ్‌సీలో చేర్పించి వైద్య సేవలందించారు. మహిళకు ముక్కు, చెవుల నుంచి రక్తస్రావం కావడంతో ఆసుపత్రిలో స్కానింగ్ సౌకర్యం లేకపోవడంతో హుటాహుటిన శాంతిరాం ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలందించాలని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డిని ఆదేశించారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో తరలించారు.

ఘనంగా నరహరి తీర్థుల ఆరాధన



నరహరితీర్థుల బృందావనానికి హారతులు ఇస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మధ్వాచార్యుల ప్రథమ శిష్యుడు నరహరితీర్థుల ఉత్తర ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కర్ణాటకలోని హంపీ సమీపంలో తుంగభద్ర నది మధ్యలో వెలసిన నరహరి తీర్థుల మూల బృందావనం వద్ద పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నిర్మల విసర్జనం, తులసి అర్చన, పంచామృతాభిషేకం, మూల రాములకు పూజలు చేశారు. అనంతరం మహా మంగళహారతులు ఇచ్చి సంస్థాన పూజ చేశారు. అక్కడుండే వందలాది మంది భక్తులకు ముద్ర ధారణ చేసి ఆశీర్వదించారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

రుద్రవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరినగరం గ్రామ సమీపంలో కోడి పందేలు ఆడుతుండగా ఎస్ఐ వరప్రసాద్ బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో కడప, నంద్యాల జిల్లాలకు చెందిన 11 మంది కోడిపందేల నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కడప జిల్లాకు చెందిన సుద్దపల్లె, నంద్యాల జిల్లాకు చెందిన రుద్రవరం, గోవిందపల్లె, ఆళ్లగడ్డ, బాచుపల్లె, రామచంద్రపురం గ్రామాలకు చెందిన 11 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న రెండు కోళ్లు, రూ.43400 నగదు, 10 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

- నగరంలో కాంగ్రెస్ భారీ పాదయాత్ర



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ

కర్నూలు అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి, జిల్లా కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి అంబటి రామకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా కొండారెడ్డి బురుజు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మర్చేయాలని ఉద్దేశంతో ఉందని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళల హక్కులను కాలరాయలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీ చేపట్టిన సంవిధాన్ బచావోలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ రచయిత అంబేద్కర్‌ను అవమానించడమంటే యావత్ దేశ ప్రజలను అవమానించినట్లేనని, అమిత్‌షా తన మాటలు వెనక్కి తీసుకొని స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతక ముందు జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం నుంచి నెహ్రూ రోడ్డు, చౌక్ బజార్, గడియారం హాస్పిటల్, పెద్ద మార్కెట్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం.ఖాసీం వలీ, చిప్పగిరి లక్ష్మీ నారాయణ, జి.రమేష్ యాదవ్, బి.క్రాంతినాయుడు, పి.మురళీకృష్ణంరాజు, ఓబీసీ చైర్మన్ డీవీ సాంబశివుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ.బ్రతుకన్న తదితరులు పాల్గొన్నారు.

అరటి సాగులో రికార్డు

- 30 కేజీల అరటి గెల
- ఆదర్శంగా నిలిచిన రైతు చంద్ర ఓబుళరెడ్డి

చాగలమర్రి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామానికి చెందిన రైతు చంద్ర ఓబుళరెడ్డి అరటి సాగులో జిల్లాలోనే రికార్డు సాధించి ఆదర్శంగా నిలిచాడు. ఆయన మూడెకరాల్లో 3,500 అరటి పిలకలు నాటి ఏడాది పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. సాధారణంగా 15 నుంచి 18 కేజీల అరటి గెల మాత్రమే వచ్చేది. ప్రస్తుతం 30 కేజీల బరువుగల అరటి గెల కాపు వచ్చింది. సాధారణంగా గెలకు 7 నుంచి 9 పెన్నలు మాత్రమే వస్తాయి. ఈ గెలకు 10 నుంచి 12 పెన్నలు కాపు వచ్చింది. అరటి తోటలోని చెట్లకు 90 శాతం 30 కేజీల బరువుగల గెలలు దిగుబడి రావడంతో టన్ను ధర అధికంగా ఉండటంతో తన కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని రైతు చంద్ర ఓబుళరెడ్డి ఆనందం వ్యక్తం చేశాడు. మొదటి కోతలోనే మూడెకరాలకు రూ.3 లక్షలు పెట్టుబడి పోను రూ.లక్ష ఆదాయం వచ్చిందని అన్నారు. గత ఏడాది అరటి టన్ను ధర రూ.16 వేలు నుంచి రూ.18 వేలు మాత్రమే ఉండేదని, ఈ ఏడాది రూ.20 వేలు నుంచి రూ.24 వేలు ధర పలకడంతో పెట్టుబడి పోను ఆదాయం వచ్చిందని అన్నారు.



చిన్నవంగలిలో అరటి గెలను చూపిస్తున్న రైతు చంద్ర ఓబుళరెడ్డి

ఉపాధ్యాయుడి వికృత చేష్టలు

- బాలికల పట్ల అసభ్య ప్రవర్తన
- తల్లిదండ్రుల ఆందోళనతో సస్పెండ్ చేసిన అధికారులు



పాఠశాల వద్ద ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు

కోడుమూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు సభ్యత మరిచాడు. అక్షరాలు నేర్పాల్సిన చేతితో బ్యాడ్ టచ్ చేస్తూ వికృతానందం పొందాడు. గురువు ప్రవర్తన పట్ల విసుగు చెందిన బాలికలు తల్లిదండ్రులకు తెలపడంతో విషయం వెలుగుచూసింది. మండలంలోని వెంకటగిరి ప్రాథమిక పాఠశాల (స్పెషల్)లో సుమారు 38 మంది బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు. 1 నుంచి 5 తరగతుల బోధనకు ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. పాఠశాలకు 2023లో లక్ష్మన్న అనే టీచర్ బదిలీపై వచ్చాడు. సదరు ఉపాధ్యాయుడు బాలికలపై ఎక్కడపడితే అక్కడ చేతులు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. రానురాను ఉపాధ్యాయుడి వికృత చేష్టలు పెరిగిపోవడంతో బాలికలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధను దిగమింగుకున్నారు. ఆరు నెలల క్రితం ఓ ఇద్దరు పిల్లలు తల్లిదండ్రులకు తెలపడంతో వారు వెళ్లి మందలించినట్లు తెలిసింది. అప్పట్లో సమస్యను పెద్దగా పట్టించుకోకపోవడంతో సమసిపోయింది. అయినా ఉపాధ్యాయుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను బడి మాన్పించి మరోచోట చేర్చారు. ప్రవర్తనలో మార్పురాని ఉపాధ్యాయుడు అదే రీతిలో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో రెండు రోజులుగా పలువురు బాలికలు బడికి వెళ్లబోమని తల్లిదండ్రులతో చెప్పారు. ఆరా తీయగా ఉపాధ్యాయుడి వికృత చేష్టలను వివరించారు. కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, గ్రామస్థులు బుధవారం ఉదయం పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుడిపి గదిలో బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మండల విద్యాశాఖాధికారులు వసంతలక్ష్మి, తైమూర్‌బాషా అక్కడికి చేరుకుని గ్రామస్థులను శాంతింపజేశారు. బాలికలను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

కోట్ల సర్కిల్‌లో రాస్తారోకో..

వెంకటగిరి పాఠశాలలో ఉపాధ్యాయుడు లక్ష్మన్న బాలికల పట్ల లైంగిక వేధింపులకు గురి చేస్తుండడంతో ఏఐఎస్ఎఫ్, సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఉపాధ్యాయుడి ప్రవర్తన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, చర్యలు తీసుకోవాలని నినదించారు. మరలా పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు..

వెంకటగిరి ప్రాథమిక పాఠశాల(స్పెషల్)లో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కాగా మండల విద్యాశాఖాధికారుల నివేదిక మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో శ్యామ్యూల్ పాల్ ఉత్తర్వులు వెలువరించారు.

రైతు ఆత్మహత్య

- అప్పుల బాధతో బలవన్మరణం



గిడ్డయ్య (ఫైల్)

కోడుమూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గ్రామంలో అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన రైతు జల్లి గిడ్డయ్య (42)కు మూడె కరాల పొలం ఉంది. ఆయన కొన్నేళ్లుగా ఉల్లిసాగు చేస్తున్నాడు. అయితే అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల దిగుబడి రాకపోవడం, దిగుబడి వచ్చినప్పుడు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నష్టాల పాలయ్యాడు. ఈ ఏడాది అధిక వర్షాలతో ఉల్లి గడ్డలు కుళ్లిపోయి నష్టం వచ్చింది. పంట సాగుకు రూ.10లక్షలు అప్పు మిగలడంతో దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది. దీంతో మంగళవారం రాత్రి ఇంటి పక్కన రేకుల షెడ్డులో ఉరివేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్ పై నుంచి పడి మహిళ మృతి

మంత్రాలయం జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన జేరుబండి శారదమ్మ (40) బుధవారం మోటారు సైకిల్ నుంచి కింద పడి మృతి చెందింది. హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు వివరాల మేరకు.. శారదమ్మ, భర్త లక్ష్మన్న కలిసి హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. సరుకుల కోసం వీరిద్దరు బైక్‌పై కోసిగి వెళ్తుండగా మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ వద్ద మృతురాలి చీర బండి చక్రాల్లో పడింది. దీంతో ఆమె కిందపడి తలకు తీవ్ర గాయాలపాలైంది. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బంకర్ కూలి బీహార్ వాసి మృతి

బనగానపల్లె, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్‌లో బంకర్ కూలడంతో బీహార్ వాసి మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్ఐ దుగ్గిరెడ్డి వివరాల ప్రకారం.. బనగానపల్లె పట్టణ శివారులోని శ్రీనివాస రైస్ మిల్‌లో వడ్లు స్టోరేజ్ చేసేందుకు ఇటీవలే బంకర్లు ఏర్పాటు చేశారు. బీహార్‌కు చెందిన హమాలీలు రైస్‌మిల్‌లో పనిచేస్తుండగా బంకరు ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో బీహార్‌కు చెందిన సుజీత్‌కుమార్ (26)అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు బీరేంద్రషా, సహనిధశరథ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. సుజీత్‌కుమార్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతి చెందిన సుజీత్‌కుమార్ మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీకి విఫల యత్నం

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెస్ నగర్‌లోని ఓ ఇంట్లో దొంగ చోరీకి విఫలయత్నం చేశాడు. స్థానికులు మెల్కొనడంతో పారిపోయాడు. కాలనీ వాసుల వివరాల మేరకు.. ఇంటి యజమాని వారి బంధువుల ఫంక్షన్‌కు వెళ్లగా ఓ గుర్తు తెలియని దొంగ కాలనీలో మోటార్ సైకిల్ వెసుకొని సంచరించాడు. మోటార్ సైకిల్‌ను వీధి చివరన ఉంచి ఓ ఇంట్లో మొబైల్ లైట్‌తో తాళం వేసిన ఇంటిని చూశాడు. ఆ తాళాన్ని పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలను పగలగొట్టే క్రమంలో అప్పటికే పసిగట్టిన కాలనీ వాసులు దొంగను పట్టుకునేందుకు వెళ్లారు. ఇది గమనించిన దొంగ ఇంట్లోని మెట్లు ఎక్కి మిద్దెపైకి వెళ్ళి పారిపోయాడు. ఇంతలో చుట్టు పక్కల వాళ్లు వెంటనే ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. యజమాని అర్ధరాత్రి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగ వదిలేసి వెళ్లిన మోటార్ సైకిల్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కన్నీటి వేదన

- కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం
- ముగ్గురు సంస్కృత పాఠశాల విద్యార్థులు, డ్రైవర్ మృతి
- సీఎం, డిప్యూటీ సీఎంల దిగ్భ్రాంతి
- కన్నీరు పెట్టుకున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం సింధనూరులో మంగళవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం నుంచి వేద విద్యార్థులతో వెళ్తున్న తుఫాన్ వాహనం ఎక్సెల్ రాడ్డు విరిగి బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. వీరిలో మంత్రాలయం సంస్కృత పాఠశాలకు చెందిన ముగ్గురు వేద విద్యార్థులతో పాటు డ్రైవర్ ఉన్నాడు. మధ్వాచార్యుల ప్రత్యక్ష ప్రథమ శిష్యులైన నరహరితీర్థుల ఉత్తరాధన పూజల కోసం మంత్రాలయం నుంచి 20 వాహనాల్లో వేద విద్యార్థులు, మంత్రాలయ పట్టణ ప్రముఖులు, నాయకులు, మఠం సిబ్బంది కలిసి దాదాపు 300 మంది హంపికి మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. అయితే ఒక తుఫాన్ వాహనంలో 13 మంది గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల వేద విద్యార్థులు ఉన్నారు. సింధనూరు సమీపంలోని పోతనాల గ్రామం వద్ద తుఫాన్ వాహనం ఎక్సెల్ రాడ్డు విరగడంతో ప్రధాన రోడ్డుపై మూడు పల్టీలు కొట్టింది. దీంతో మంత్రాలయానికి చెందిన డ్రైవర్ కంసాలి శివ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. మంత్రాలయానికి చెందిన గుంజెల్లి సుజయీంద్ర (22), బళ్లారికి చెందిన హయవదన (19), కొప్పల్‌కు చెందిన అభిలాష (20) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. బళ్లారికి చెందిన మరో వేద విద్యార్థి జయసింహ పరిస్థితి విషమంగా ఉంది. ఇదే వాహనంలో ప్రయాణిస్తున్న కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణకు చెందిన పది మంది వేద విద్యార్థులు శ్రీహరి, విజయేంద్ర, భరత్, రాఘవేంద్ర, తణిష్, శ్రీకర, వాసుదేవ, భసంత శర్మ, రాఘవేంద్ర, జయసింహలకు తీవ్ర గాయాలు కావడంతో సింధనూరు ఆసుపత్రికి తరలించారు. ఇందులో జయసింహ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రాయచూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను తమ సొంత గ్రామాలైన మంత్రాలయం, బళ్లారి, కొప్పల్‌కు తరలించారు. వీరికి లింగసూగూరు డీఎస్పీ దత్తాత్రేయ కర్నాడు, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి దగ్గరుండి వైద్యసేవలు చేయించారు. సంస్కృత పాఠశాల విద్యార్థులు నలుగురు మృతి చెందడంతో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కన్నీరు పెట్టుకున్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, మఠం అండగా ఉంటుందన్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

మంత్రి బీసీ విచారం

బనగానపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వేద పాఠశాల విద్యార్థుల మృతిపై రోడ్లు భవనాల శాఖా మంత్రి బుధవారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వేద విద్యార్థులు, డ్రైవర్‌కు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కర్ణాటక ప్రభుత్వాన్ని మంత్రి కోరారు. మృతి చెందిన కుటుంబాలకు ఎన్‌డీఏ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

ఎంపీ బస్తిపాటి దిగ్భ్రాంతి

కర్నూలు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వేద పాఠశాలకు చెందిన విద్యార్థులు మృతి చెందడంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దైవ కార్యాక్రమానికి వెళ్తున్న సమయంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. మృతులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వంతో పాటు పాటు తాను కూడా అండగా ఉంటానని చెప్పారు.

ప్రముఖుల సంతాపం

మంత్రాలయం చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటనపై ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, సిద్దరామయ్య, రేవంత్ రెడ్డిలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, విధ్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, మేనేజర్ సురేష్ కోనాపూర్‌లు సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ౩. లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబాలకు అండగా ఉంటామని కర్ణాటక సీఎం హామీ ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆదేశాలు జారీ చేశారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను తమ సొంత గ్రామాలైన మంత్రాలయం, బళ్లారి, కొప్పల్‌కు తరలించారు.



హంపీలో విచారం వ్యక్తం చేస్తున్న పీఠాధిపతి





సంఘటనా స్థలంలో బోల్తాపడ్డ వాహనం

శవమై వచ్చాడు...



హయవదన మృతదేహం

శాస్త్రాలు చదివి గొప్ప పాండిత్యంతో తిరిగి వస్తాడని ఆశపడితే శవమై వచ్చాడు. అర్చకుడుగా పని చేస్తూ నా కుమారుడు శాస్త్రాలను చదువుతాడని ఆశిస్తే దేవుడు చిన్న చూపు చూశాడు. కొడుకు లేని జీవితం ఎలా గడపాలి.

- హయవదన తండ్రి ప్రహ్లాదాచార్(బళ్లారి)

దేవుడు చిన్న చూపు చూశాడు



అభిలాష మృతదేహం

దేవుడు మాపై చిన్న చూపు చూశాడు. ఉన్న ఒక్క కొడుకును వేద పాఠశాలకు పంపిస్తే మృత్యువు కబలించిది. మా కుటుంబాన్ని తీరని శోకం మిగిల్చింది. మా కొడుకు లేని మా జీవితం ఎలా. ఆ బాధను తట్టుకోలేకపోతున్నాం.

- అభిలాష తండ్రి అశ్వథ్ కొప్పల్, కర్ణాటక

వేద పండితుడు అవుతాడనుకున్నాం



సుజయీంద్ర మృతదేహం

ఉన్న ఒక్క కొడుకు వేద పండితుడు అవుతాడని ఆశపడ్డాం. ఆరేళ్ల చదువు పూర్తయింది. మరో ఆరేళ్ల చదవాల్సి ఉండగా మృత్యువాత పడటం గుండె కోత మిగిల్చింది. ఉన్న ఒక కొడుకుపై పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి.

- సుజయీంద్ర తల్లిదండ్రులు కృష్ణమూర్తి, జానకి, మంత్రాలయం

నలుగురు కొడుకుల్లో ఇద్దరు ప్రమాదంలోనే..



డ్రైవర్ కంసాలి శివ

నలుగురు కొడుకుల్లో ఇద్దరు ప్రమాదంలోనే మృతి చెందారు. మూడో కుమారుడు పవన్ వినాయక చవితిలో విద్యుదాఘాతనికి గురై మృతి చెందాడు. ఇప్పుడేమో ఆఖరి కొడుకు శివ మృతి చెందాడు. ఇద్దరు కొడుకులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నాం.

- డ్రైవర్ శివ తండ్రి సోమన్న

పత్తి జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

(3వ పేజీ తరువాయి..)

మార్కెట్ యార్డులోని అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలం చేరుకొని సహాయక పనుల్లోకి దిగారు. అయినా మంటలు అదుపులోకి రాలేదు. ఆదోని రెండు ఫైర్ ఇంజన్లతో పాటు ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నుంచి కూడా ఫైర్ ఇంజన్లు తెప్పించి 40-45 మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. భారీ ప్రమాదం కావడంతో స్థానిక అగ్నిమాపక విభాగం ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు సమాచారం మేరకు అగ్ని మాపక శాఖ రీజినల్ ఫైర్ ఆఫీసర్ (ఆర్ఎఫ్ఓ) భూపాల్‌రెడ్డి, డీఎఫ్ఓ అవినాశ్ జయసింహ ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. రాత్రి 9.30 గంటలు దాటినా పరిస్థితి అదుపులోకి రాలేదు. సహాయక చర్యలు కొనసాగుతునే ఉన్నాయి.

రూ.10 కోట్లకుపైగా నష్టం..

సంతోష్ జిన్నింగ్ మిల్లులో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో రూ.10 కోట్లకు పైగా నష్టం జరిగి ఉంటుందని అనధికారిక అంచనా. రూ.1.80 కోట్ల విలువైన 600 పత్తిదూది బేళ్లు (ఒక్కో బేలు 170 కిలోలు), రూ.2 కోట్లకు పైగా విలువైన పత్తి చెక్కులు, రూ.కోటికి పైగా విలువ చేసే పత్తి గింజలతో పాటు విలువైన టీఎంసీ కాటన్ జిన్నింగ్, ప్రెస్సింగ్ యంత్ర సామగ్రి, ఇతర పరికరాలు, మిల్లు మొత్తం కాలిబూడిదైందని మిల్లు యజమాని ప్రశాంత్ కన్నీరుమున్నీరయ్యారు. దాదాపుగా రూ.9-10 కోట్లకుపైగా నష్టం వాటిందని వాపోయారు. మూడు నాలుగేళ్లలో పత్తి మిల్లుల్లో జరిగిన ప్రమాదాలతో పోలిస్తే ఇదే అతిభారీ ప్రమాదమని స్థానికులు అంటున్నారు. 2021 మార్చి 29న ఆస్పరి రోడ్డులోని వెంకటలక్ష్మి, తిరుపతమ్మ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.60 వేలు నష్టం జరిగింది. 2023 జనవరిలో సంతోష్ పత్తి మిల్లులో జరిగిన ప్రమాదంలో రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. 2023 అక్టోబరులో బసవేశ్వర కాటన్ జన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లులో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.50 లక్షలకు పైగా నష్టం జరిగింది. అత్యంత భారీ అగ్ని ప్రమాదం ఇదేనని, పూర్తిగా మిల్లు కాలిబూడిదైందని స్థానికులు పేర్కొన్నారు.



మిల్లులో వ్యాపించిన మంటలు

భారీ ప్రమాదం ఇది

సంతోష్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సిం గ్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. నాలు గైదేళ్లలో ఇదే భారీ ప్రమాదం. పత్తి, దూదితో పాటు యంత్రాలు, బిల్లు పూర్తిగా కాలిపోయింది. రాత్రి 10 గంటల వరకు మంటలు అదుపులోకి రాలేదు. ఐదు ఫైర్ ఇంజన్లు, 40 మందికి పైగా సిబ్బందితో మంటలు ఆర్పే పనుల్లో నిమగ్నమయ్యాం. పూర్తిగా అదుపులోకి వచ్చాక, యాజమాన్యం రికార్డులు పరిశీలించి ఎంత నష్టం జరిగిందీ అంచనా వేస్తాం. **- అవినాశ్ జయసింహ, డీఎఫ్‌వో, అగ్నిమాపక శాఖ, కర్నూలు**

చూస్తుండగానే మంటలు వ్యాపించాయి



సంతోష్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లుకు ఏపీ21 టీడబ్ల్యూ 4645, మరో వాహనం ఏపీ 39 వీటీ 0858లో 50 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రైతులతో పాటు వచ్చాం. ధర మాట్లాడి అన్‌లోడ్ చేసేందుకు మిల్లు లోపలికి వెళ్లాం.విద్యుత్ వైర్ల నుంచి నిప్పులు పత్తిపై పడ్డాయి. క్షణాల్లో మంట మిల్లు మొత్తం వ్యాపించింది. ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశాం. అగ్ని ప్రమాదంలో మా రెండు వాహనాలు కూడా కాలిబూడిదయ్యాయి. ఆ వాహనాలే మాకు జీవనాధారం. **- నారాయణ, పత్తి లారీ ఓనర్, బస్సాపురం, ఆదోని మండలం**

రూ.10 కోట్ల వరకు నష్టం



మధ్యాహ్నం సమయంలో పరిశ్రమలు 50 మందికి పైగా ఉన్నాం. జిన్నింగ్, ప్రెస్సింగ్ పనులు జరుగుతున్నాయి. పత్తి దూది బేళ్లు కొనుగోలు చేసేందుకు కొందరు వచ్చారు. వారితో మాట్లాడుతున్నాం. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల నిప్పు రవ్వలు పత్తి, దూదిపై పడడంతో మంటలు వ్యాపించాయి. పరిశ్రమ మొత్తం కాలిబూడిదైంది. సుమారు రూ.10 కోట్లకు పైగా నష్టం జరిగింది.

- ఎన్.ప్రశాంత్, పరిశ్రమ యజమాని, ఆదోని

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

న్యాక్ బృందం సందర్శన



కళాశాలలో పర్యటిస్తున్న 'న్యాక్' బృందం సభ్యులు



మొక్క నాటుతున్న 'న్యాక్' బృందం సభ్యులు

నందికొట్కూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉపకులపతి డా.రాజేష్ కుమార్ సింగ్ డాకారే నేతృత్వంలో విశ్రాంత ప్రొఫెసర్ డా.ప్రియం, పీకే డా. రాజేష్‌లతానేలతో కూడిన 'న్యాక్ త్రిసభ్య కమిటీ బందృం బుధవారం కళాశాలను సందర్శించింది. ముందుగా కళాశాల స్థలదాత దివంగత జవ్వాజి సుంకన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. తమ సందర్శనకు చిహ్నంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి వివిధ విభాగాధిపతులతో ముఖాముఖిలో భాగంగా వివిధ విభాగాల ప్రాశస్త్యాన్ని తాఖీదు చేశారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమై అంచనా వేస్తూ కళాశాల పురోగమన చర్యల గురించి చర్చించారు. అనంతరం కళాశాల విద్యార్థులతో భేటీ అయి కళాశాలలో బోధనా విధానాలపై చర్చించారు. బోధనేతర సిబ్బందితో భేటీ నిర్వహించారు. విద్యారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆఅలరించాయి. గురువారం కూడా 'న్యాక్ బృందం పర్యటిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి: మంత్రి



పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ, అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాలలోని 37, 38వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల నిర్మాణాలకు మంత్రి ఫరూక్ బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ, గ్రామాలలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధి కార్యక్రమాలకు మహర్దశ వచ్చిందని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదిశగా చేస్తున్నామని సంక్షేమంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీపడే ప్రసక్తేలేదని, నాణ్యవంతమైన నిర్మాణాలు చేపట్టాలని కాంట్రాక్టర్లకు మంత్రి ఫరూక్ ఆదేశించారు. నందమూరినగర్, వైఎస్‌నగర్‌లలోని సమస్యలను ప్రజలనుంచి ఆయన తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, కౌన్సిలర్లు ఖండే శ్యాంసుందర్‌లాల్, నాగార్జున, జైనాబీ, శ్రీదేవి, మహబూబ్‌వలి, ఆయా వార్డుల ఇన్‌చార్జులు తాటికొండ బుగ్గరాముడు, దేరెడ్డి శివనాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మెరుగైన వైద్య సేవలు అందిస్తాం'

పాణ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు మెరుగైన సేవలు అందించనున్నట్లు భవిత ఏపీసీ ప్రేమంత కుమార్ తెలిపారు. బుధవారం ఆయన పాణ్యంలోని భవిత పాఠశాలను పరిశీలించారు. ఆయన ప్రత్యేక అవసరాల పిల్లలకు ఏ కార్యక్రమాలు చేస్తారో అడిగారు. ట్యాబ్స్‌లలో యాప్స్ ద్వారా, ఫ్లాష్ కార్డుల ద్వారా విద్యాబోధన, నిత్యం జరిగే ఫిజియోథెరపీ, వ్యాయామంపై ఐఈఆర్‌పీలు శివసాయిప్రసాద్, సంపూర్ణరావును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యాశాఖ తరపున కొంతమందిని సేకరించి ఉచితంగా మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తామన్నారు. అనంతరం ఉర్దూ పాఠశాలను తనిఖీ చేశారు. ఏఎంవోలు లలిత కుమారి, యూనస్, రామ్మోహన్, ఎంఈవోలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, కృష్ణప్రియ, సీఆర్‌పీలు రాజశేఖర్, నాగరాజు, పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధి కార సంస్థ ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి నందికొట్కూరు పట్టణంలోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైలులో ఉండే రిమాండ్ ఖైదీల వివరాలను అడిగితెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతేకాకుండా ఖైదీల ఆరోగ్య పరిస్థితిని, ఆహార ఏర్పాట్ల గురించి విచారించారు. కార్యక్రమంలో సబ్‌జైలు విసిటింగ్ న్యాయవాది అరుణ్‌కుమార్, మద్దయ్య, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత

నంద్యాల క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా నుంచి నంద్యాల ప్రాంతానికి మూడు లారీల్లో తరలిస్తున్న ఇసుకను నంద్యాల తాలుకా పోలీసులు పట్టుకున్నారు. నంద్యాల తాలుకా రూరల్ సీఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలివీ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డంప్ యార్డుల నుంచి అన్ని రకాల అనుమతులతో లారీల్లో ఇసుకను నిరభ్యంతరంగా తీసుకువెళ్లవచ్చు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఆధార్ కార్డు ఒకరిపేరిట ఉండగా ఇసుక రవాణా మరొకరి పేరుతో జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నంద్యాల రూరల్ పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. కడప జిల్లా నుంచి నంద్యాలకు అక్రమంగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న మూడు లారీల్లో ఒకదాన్ని అయ్యలూరు దగ్గర, మిగతా రెండింటిని రైతునగరం సమీపంలో పట్టుకొని తాలుకా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేదిలేదని నంద్యాల తాలుకా రూరల్ సీఐ ఈశ్వరయ్య హెచ్చరించారు.

'వన్యప్రాణుల దాహం తీర్చడానికి చర్యలు'

మిడుతూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు అభయారణ్యంలో వన్య ప్రాణులకు దాహం తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏబీవో శ్రీనివాసులు బుధవారం తెలిపారు. రోళ్లపాడు అభయారణ్యంలో సంచరిస్తున్న వన్యప్రాణుల దాహం తీర్చుడానికి ఏర్పాటు చేసిన సాసర్లు, నీటి కుంటలలో ట్రాక్టర్ల ద్వారా నీటిని నింపినట్లు తెలిపారు.

'సద్వినియోగం చేసుకోవాలి '

గడివేముల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి పావని సూచించారు. చిందుకూరులో బుధవారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భధారణకు సంబంధించిన వ్యాధులను పరిశీలించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'జాగ్రత్తలు తీసుకోవాలి'

కొత్తపల్లి జనవరి 22 (ఆంధ్రజ్యోతి): లేగదూడల ఆరోగ్యం పట్ల పశువుల యజమానులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి రాజశేఖర్, కర్నూలు బహుళార్ధ పశువైద్యశాల ఉప సంచాలకుడు హేమంత్ సూచించారు. గువ్వల కుంట్లలో పశువైద్యాధికారి భువనేశ్వరి ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకుడు మల్లన్న, ఆత్మకూరు సహాయ సంచాలకులు అరుణ, వెంకటాపురం పశువైద్యాధికారి రవి, లైవ్‌స్టార్ అసిస్టెంట్ రామాంజనేయులు, పశుసంవర్ధక సహాయకులు శార, సిబ్బంది చాంద్‌బాషా, సరితబాయి, మద్దిలేటి, గోపాలమిత్ర తిరుపాలు ఉన్నారు.

'ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

పాములపాడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుద్యోగ యువతీ యవకులు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 21 ఏళ్ల నుంచి 24 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ నెల 26 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9951775909, 63003244076, 8297812530 నెంబర్లను సంప్రదించాలన్నారు.

'పని వేళలు పాటించాలి'

మిడుతూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది పని వేళలు పాటించాలని ఎంపీడీవో దశరథ రామయ్య సూచించారు. మండలంలోని అలగనూరు గ్రామంలోని సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ఉదయం 10:30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు తప్పని సరిగా హాజరు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆధార్ ప్రత్యేక క్యాంపును పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి, పంచాయతీ కార్యదర్శి సుగుణవతి పాల్గొన్నారు.

'వర్షాభావ పరిస్థితుల్లోనూ అధిక దిగుబడి'



పొగాకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పాణ్యం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితిల్లోనూ పొగాకు అధిక దిగుబడి వస్తుందని అఖిల భారత పొగాకు సమన్వయ పథకం శాస్త్రవేత్తలు అన్నారు. బుధవారం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు పుల్లీబాయి, సతీష్‌బాబు పారుమంచాల, కడుమూరు గ్రామాలలోని పొగాకు పంటలను పరిశీలించారు. పరిశోధన స్థానం నుంచి విడుదలైన బీడీ పొగాకు రకాలు నంద్యాల పొగాకు 1, నంద్యాల పొగాకు 2, బీడీ పొగాకు, హైబ్రిడ్ రకాల క్షేత్రాలను పరిశీలించారు. పొగాకు 1 రకం వర్షాభావ పరిస్థితిల్లోనూ బాగుందన్నారు. హైబ్రిడ్ పొగాకు ఎకరాకు 12 వందల కిలోల దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం పొగమల్లె నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివ రించారు. కార్యక్రమంలో జేపీఐ ఫీల్డ్ టెక్నీషియన్, రైతులు పాల్గొన్నారు.

సాక్షి గణపతికి అభిషేకం

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్ర పరిధిలోని సాక్షిగణపతి స్వామికి బుధవారం విశేష అభిషేకాన్ని నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపారు. అలాగే ఆలయానికి ఉత్తర భాగంలో మల్లికా గుండం పక్కనే ఉన్న వీరభద్ర స్వామికి బుధవారం ప్రదోషకాలంలో విశేష పూజలు చేశారు. అలాగే పుష్పార్చన నిర్వహించారు.

● శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా బుధవారం దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదికపై కర్నూలుకు చెందిన నారాయణ కళాజాత బృందం వారు నిర్వహించిన భక్తిరంజని కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. రెండో కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన అక్షదా డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ హెరు సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే బుడ్డా



శ్రీశైల క్షేత్రం ఆవరణలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను బుధవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆ తర్వాత రత్నగర్భ వినాయక స్వామి దర్శనం అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆతర్వాత వేదాశీర్వచన మంటపంలో అర్చకులు ఆయనకు స్వామి, అమ్మవార్ల వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, జ్ఞాపిక, తీర్థప్రసాదాలను దేవస్థానం ఈవో శ్రీనివాసరావు పంపిణీ చేశారు.

బోర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బుడ్డా

శ్రీశైల క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం తరుపున గోసంరక్షణశాల వద్ద ఏర్పాటు చేయించిన బోర్‌కు బుధవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. హఠకేశ్వరం, గోసంరక్షణశాల, రుద్రపార్క్ ప్రదేశాల్లో బోరు బావులను ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. ఈవో శ్రీనిసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీబాలకృష్ణ, నీటి సరఫరా విభాగం సహాయ ఇంజనీరు రాజేశ్వర రావు తదితరులు ఉన్నారు.

'అభివృద్ధి ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలి'



మాట్లాడుతున్న ఎస్ఐఆర్డీ స్టేట్ క్వాలిటీ మానిటరింగ్ ఆఫీసర్ నాగేశ్వరరావు

గడివేముల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సమగ్రంగా అభివృద్ధి చేయడానికి పకడ్బందీగా ప్రణాళికలను రూపొందించాలని ఎస్ఐఆర్డీ స్టేట్ క్వాలిటీ మానిటరింగ్ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కొరటమద్ది గ్రామ సచివాలయంలో అభివృద్ధి ప్రణాళిక తయారు చేసే విధానంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక అభివృద్ధి, మానవ అభివృద్ధి, విద్యా, ఆరోగ్య, తాగునీటి సరఫరా అంశాలతో ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలను, బిల్లుల వివరాలను పొందుపరచాలని అన్నారు. ఆర్థిక సంఘం నిధులతో గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవ గుప్తా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నంది బాలోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టౌన్‌హాల్‌లో బుధవారం నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నంది ద్వితీయ బాలోత్సవాలు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభచాటారు. పిల్లలలో నైపుణ్యాలను వెలికితీయడానికి నంది బాలోత్సవాలు ఉపయోగపడతాయని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి ఉత్సవాలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం డాక్టర్ రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక, వ్యాసరచనలతో పాటు పలురకాల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లలు సత్ప్రవర్తనతో పాటు విలువలు కలిగిన జీవన విధానాన్ని నేర్చుకుంటారని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్య, జానపద కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాలోత్సవ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్, గౌరవ సలహాదారులు శంకరయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి మౌలాలి, కోశాధికారి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయం తనిఖీ

నంద్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని నందమూరినగర్‌లో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయాన్ని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.ప్రేమంతకుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. నిర్వహణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. ప్రత్యామ్నాయ పాఠశాలల కో ఆర్డినేటర్ రఘురామి రెడ్డి, సిబ్బంది నాగలక్ష్మి, లక్ష్మీదేవి, రాజేశ్వరమ్మ ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

నంద్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఉప విద్యాశాఖాధికారి సమావేశ భవనంలో బుధవారం గ్రహణం మొర్రి, గ్రహణశూల నిర్ధారణ వైద్య శిబిరం జరిగింది. జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ప్రేమంతకుమార్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ బసవ తారకం స్మైల్ ట్రైన్ సెంటర్, బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు ముకుందరెడ్డి, జోషి, రవితేజ బృందం హాజరయ్యారు. 46మంది పిల్లలను పరీక్షించి వారిలో 26మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించి ఆపరేషన్ చేసే తేదీలను వారికి తెలియజేశారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు, అక్కడ వసతి, భోజన సదుపాయం, రవాణా ఖర్చులు ఆస్పత్రి యాజమాన్యం భరిస్తుందని వైద్యులు తెలిపారు. జిల్లా సహిత విద్యాసమన్వయకర్త రఘురామిరెడ్డి, సహాయ సమన్వయ కర్త శ్రీనివాసులు, భవిత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

నంద్యాల రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయ్యలూరు, చాబోలు గ్రామాల్లో జేసీ విష్ణుచరణ్ బుధవారం పర్యటించి నూతనంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ పంపులను పరిశీలించారు. ప్రారంభానికి అవసరమైన అర్హతలు ఉన్నాయా, లేవా ప్రభుత్వ నిబంధనల మేరకు ఏర్పాటు చేస్తున్నారా పరిశీలించారు. నంద్యాల పట్టణ తహసీల్దార్ ప్రియదర్శిని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'యూరియా కొరత లేకుండా చూడాలి'



జేసీ విష్ణుచరణ్‌ను కలిసిన తులసి రెడ్డి

నంద్యాల కల్చరల్/పాణ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పార్లమెంట్ పరిధిలో యూరియా కొరత సమస్యను పరిష్కరించాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో జేసీని కలిసి యూరియా సమస్య, వేరుశనగ రైతుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. యూరియా, వేరుశనగ రైతుల సమస్యలు పరిష్కరిస్తానని జేసీ హామీ ఇచ్చారని చెప్పారు.

మిరప లోడ్‌తో వెళ్లే వాహనాలకు ఆంక్షలు



ఆత్మకూరులో తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఆత్మకూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నల్లమలలోని కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై అధిక మిరప లోడ్‌తో వెళ్లే వాహనాలకు రవాణా శాఖ అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. బుధవారం ఆత్మకూరులోని నంద్యాల టర్నింగ్ వద్ద మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి నేతృత్వంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలను నిలిపివేసి డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటూరు మిర్చి యార్డుకు ప్రతిరోజు వందల సంఖ్యలో మిరపలోడుతో వాహనాలు వెళ్తున్నాయని అన్నారు. అయితే ఓవర్ లోడ్‌తో పాటు ఎత్తుగా మిరప బస్తాలను లోడ్ చేసి నల్లమలలోని కేజీరోడ్డుపై ప్రమాదాలు జరగవచ్చని, ట్రాఫిక్ జామ్ కావొచ్చని అన్నారు. భక్తులు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు మిరపలోడుతో వెళ్లే వాహనాలను గిద్దలూరు మీదుగా దారి మళ్లించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతిరోజు రవాణా శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టను న్నట్లు చెప్పారు. కాగా మిరపలోడుతో వెళ్లే వాహనదారులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని, లోడ్‌పై రైతులను ఎక్కించుకోవద్దని సూచించారు.

ఆసుపత్రిలో మొదటి సిజేరియన్ కాన్పు

నందికొట్కూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు మొదటి సిజేరియన్‌ను చేశారు. నంది కొట్కూరు పట్టణానికి చెందిన ఓ మహిళ కాన్పు కోసం నంది కొట్కూరు ఆసుపత్రికి వచ్చారు. సాధారణ కాన్పు కాకపోవడంతో డాక్టర్లు సిజేరియన్ చేశారు. ఈ ఆసుపత్రిలో చేసిన మొదటి సిజేరియన్ అని సూపరింటెండెంట్ రాంబాబు తెలిపారు.

నాగేశ్వరయ్యకు పురస్కారం

నంద్యాల రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలోని అయ్యలూరు గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు కేవీ నాగేశ్వరయ్యకు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం వరించింది. బుధవారం విజయవాడలోని కౌతా పూర్ణానంద విలాస్ కళావేదిక నందు జరిగిన శ్రీశ్రీ కళావేదిక, వరల్డ్ రైటర్స్ ఫోరమ్, వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోషియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్తంగా నిర్వహించిన అవార్డుల ప్రదానంలో కేవీ నాగేశ్వరయ్య సాహిత్య రంగంలో చేసిన విశేష కృషిని గుర్తించారు. శ్రీశ్రీ కళా వేదిక సంస్థ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా తెలుగు కీర్తి బిరుదును ఇస్తూ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

'ఎల్ఐసీలో నియామకాలు చేపట్టాలి'



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆత్మకూరు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆత్మకూరు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ కుమార్, మనోజ్, జాయింట్ సెక్రటరీ నాగన్న డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త నిరసనలో భాగంగా ఆత్మకూరు ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎల్ఐసీలో 2700 అసిస్టెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఖాళీగా ఉన్న క్లాస్-4 నూతన నియామకాలు చాలా కాలంగా జరగడం లేదని అన్నారు. అలాగే తమ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని, లేకపోతే సమ్మెబాట తప్పదని హెచ్చరిం చారు. నాయకులు రవి కుమార్, స్వరూప్, అమీర్, ప్రవీణ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

మహానంది, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గాజులపల్లి సమీపంలోని బుచ్చమ్మ తోపు శివారు ప్రాంతంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు నంద్యాల ఎక్సైజ్ శాఖ ఎస్ఐ బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం సిబ్బంది సహాయంతో దాడులు నిర్వహించి బెల్లం ఊటను స్వాధీనం చేసుకోవడంతో పాటు అబ్బీపురం, యి.బొల్లవరం గ్రామాల్లో ఇద్దరు బెల్ట్ షాపు నిర్వాహకులను అరెస్ట్ చేసామన్నారు. పాణ్యంలో అక్రమంగా సారా అమ్ముతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని 10 లీటర్ల సారాతో పాటు బైకును స్వాధీనం చేసుకొన్నామన్నారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేసామని తెలిపారు. సిబ్బంది ప్రకాష్‌రావు, విజయుడు, సుధాకర్, ఫరూక్ పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌లో ఇసుక ఉండడం లేదు

● రీచ్‌ల నుంచి ఇసుకను తరలించడానికి అవకాశం కల్పించాలి

● ఎమ్మెల్యేను కోరిన ట్రాక్టర్ యజమానులు



ఆందోళన చేస్తున్న ట్రాక్టర్ యాజమానులు

నందికొట్కూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు స్టాక్ పాయింట్‌లో ఇసుక స్టాక్ ఉండడం లేదని, ఇసుకను అధికంగా డంప్ చేయించాలని ట్రాక్టర్ డ్రైవర్లు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను కోరారు. బుధవారం పట్టణంలోని స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లేకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ట్రాక్టర్ యజమాని ఉస్మాన్‌బాషా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకపై జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు ఉచిత ఇసుక పథకం వచ్చాక కూడా తమకు ఇసుక అందుబాటులో లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. స్టాక్ పాయింట్‌లో ఇసుకను ఎప్పుడు డంప్ చేసి, అందుబాటులో ఉంచాలని వారు కోరారు. అనంతరం అల్లూరులో ఎమ్మెల్యే జయసూర్యను ట్రాక్టర్ డ్రైవర్లు కలిశారు. వారు మాట్లాడుతూ నాపరాళ్లను కర్నూలుకు రవాణా చేస్తామని, అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్ ఖాళీగా వచ్చే సమయంలో కర్నూలు ఇసుక రీచ్ నుంచి ఇసుకను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఉచిత ఇసుక లబ్ధిదారులకు అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా : డీఎస్పీ


డీఎస్పీ ప్రమోద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పట్టణ సీఐ చిరంజీవి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా ఉంచుతామని డీఎస్పీ కొల్కిపూడి ప్రమోద్ అన్నారు. ఆళ్లగడ్డ నూతన డీఎస్పీగా ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు, అసాంఘిక కార్యకలాపాల నివారణకు కృషి చేస్తానన్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెంచుతామన్నారు. మద్యం, ఇసుక అక్రమ రవాణా, పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి వాటిని నిర్వహించినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆళ్లగడ్డ పట్టణ సీఐ చిరంజీవి, ఎస్ఐ నగీనా, సబ్ డివిజన్‌లోని పలువురు పోలీసు అధికారులు డీఎస్పీ ప్రమోద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

'ఎస్సీ జాబితాలో చేర్చొద్దు'

ప్యాపిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చొద్దని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్సీ మద్దిలేటి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఎమ్మార్పీస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ కొన్ని కులాల వారు ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇతర కులాలను ఎస్సీలోకి చేరిస్తే తమకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ నా యకులు తహసీల్దారు భారతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తిమ్మనాగేంద్ర, ప్రకాష్, ఓబులేసు, శేఖర్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

పాడి రైతుల అభ్యున్నతే లక్ష్యం

కోవెలకుంట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని విజయవాడ పశు సంవర్ధక శాఖ డైరెక్టరు మాధవరావు అన్నారు. బుధవారం అమడాల గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆళ్లగడ్డ పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు రమణయ్యతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ క్రిష్ణకుమార్, టీడీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ వల్ల విద్యార్థుల జీవితాలు నాశనం

బనగానపల్లె, జనవరి 22(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వల్ల విద్యార్థుల జీవితాలు నాశనం అవుతాయని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.లలిత అన్నారు. బుధవారం బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకురాలు కౌసల్యాదేవి మాట్లాడుతూ డ్రగ్స్ వాడకాన్ని అరికట్టడం, వాటిని యువతకు దూరంగా ఉంచడం లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కళాశాలలో ప్రత్యేక కమిటీ వేసి అధ్యాపకులు, విద్యార్థులు సభ్యులుగా ఉండేటట్లు చేసినట్లు తెలిపారు. అధ్యాపకులు మహమ్మద్‌గౌస్, సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ నివారణకు తల్లిదండ్రులు, డాక్టర్లు, సమాజం, మీడియా సహకరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు ఉమామహేశ్వరరెడ్డి, రామన్న, ఉమాశంకర్, రుషేశ్వరుడు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ సంరక్షణలో నిర్లక్ష్యం చేయొద్దు

రుద్రవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అటవీ సంరక్షణలో నిర్లక్ష్యం తగదని సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం రుద్రవరంలో ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అటవీ తీర గ్రామాల సమీపంలో సమాచారం సేకరించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

తెగుళ్ల బారిన ఎర్ర బంగారం

- ఎదుగుదల లేని మిరప పంట
- రాలిపోతున్న కాయలు
- ఆందోళనలో రైతులు


ఎగ్గొని సమీపంలో సాగైన మిరప పంట

సంజామల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎర్ర బంగారం తెగుళ్ల బారిన పడింది. వేల రూపాయలు వెచ్చించి క్రిమిసంహారక మందులు పిచికారి చేసిన తెగుళ్లను నివారించలేక పోతున్నట్లు మిరప రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా ఆల్వకొండ, ఆకుమళ్ల, ముక్కమళ్ల, రెడ్డిపల్లె, రామిరెడ్డిపల్లె, గిద్దలూరు, మంగపల్లె, ఎగ్గొని గ్రామాల్లో దాదాపు నాలుగు వేల ఎకరాల్లో రైతులు మిరప పంటను సాగు చేశారు. బింగి, నల్లి, ఆకుముడత వంటి తెగుళ్ల సోకి ఎదుగుదల లేకుండా పోయింది. రూ. లక్షలు పెట్టుబడులు పెట్టిన పంట చేతికి రాకపోవడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. గత ఏడాది కూడా మార్కెట్‌లో ధర లేకపోవడం ఈ ఏడాది పంటకు తెగుళ్ల సోకడం మిరప రైతులను ఆందోళనకు గురి చేస్తుంది.

భారీగా ధర పతనం

మిరప ధర మార్కెట్‌లో భారీగా తగ్గిపోయింది వారం క్రితం క్వింటాల్ రూ.10వేలు ఉన్నా మిరప ధర వారం రోజులకే రూ.7వేలకు పడిపోయింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. గత ఏడాది పంటను కూడా గౌడౌన్‌లో భద్ర పరిచి భారీగా నష్టపో యారు. ప్రస్తుతం రోజురోజుకు ధర తగ్గిపోతుండటం రైతులను భయాందోళనకు గురి చేస్తుంది.

ఆరు ఎకరాల్లో సాగు చేశాను



ఆరు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. ఇప్పటికే పెట్టుబడిగా రూ. ఐదు లక్షలు వెచ్చించాను. నాట్లు వేసినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడు కుంటూ వచ్చినా తెగుళ్లను నివారించలేక పోతున్నాను. కాస్తో కూస్తో పండిన పంటకు ధర లేకుండా పోయింది.

- వలి, రైతు, గిద్దలూరు

బింగి తెగులు నాశనం చేసింది



మూడు ఎకరాల్లో 6 / 7 రకం మిరపను సాగు చేశాను. పెట్టుబడిగా భారీ పైకం వెచ్చించాను. బింగ తెగులు సోకి మొక్కకు కాసిన కాయలు రాలిపోతున్నాయి. ఈ ఏడాది నష్టం ఎదుర్కోక తప్పదు. ప్రభుత్వం ఆదుకోవాలి. లేకపోతే కోలుకోలేక ఇబ్బంది పడుతాం.

- మద్దిలేటి, రైతు, ఎగ్గొని

వైభవం.. స్వాతి మహోత్సవం


అహోబిలంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వాతి మహోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. నారసింహుడి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని అహోబిలం క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లి అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయం ఎదురుగా యాగశాలలో కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ఎదురుగా హోమ మండపంలో స్వాతి సుదర్శన హోమం, పూర్ణాహుతి, కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వాతి వేడుకల్లో పాల్గొన్నారు. భక్తుల గోవింద నామస్మరణతో అహోబిలం క్షేత్రం మారుమ్రోగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

పెండింగ్ పనుల పరిశీలన


జాతీయ రహదారి పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో నరసింహులు,

బేతంచెర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సోమయాజులపల్లె నుంచి జాతీయ రహదారి 340 బి పెండింగ్ పనులను డోన్ ఆర్డీవో నరసింహులు బుధవారం పరిశీలించారు. బేతంచెర్ల మండలంలోని ఆర్.కొత్తపల్లె, హెచ్.కొట్టాల, బేతంచెర్ల గ్రామాలకు చెందిన రైతుల పొలాలు, రోడ్లలో పోయిన వారికి పంట నష్టపరిహారం డబ్బులను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. రైతులు త్వరగా పంట పొలాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే జాతీయ రహదారిలో అక్కడక్కడ ఉన్న పెండింగ్ పనులను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టు పెండింగ్ పనులను త్వరితగతిన నాణ్యతగా ఉండేలా పనులు పూర్తి చేయాలని జాతీయ రహదారి కాంట్రాక్టర్లను, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బేతంచెర్ల తహసీల్దార్ ప్రకాష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ మారుతి, రీసర్వే డీటీ మహేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ నాగరాజు నాయక్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

మండలంలో రీసర్వే జరిగిన గ్రామాల్లోని రైతుల నుంచి వచ్చిన 120 అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని డోన్ ఆర్డీవో నరసింహులు రెవెన్యూ అధికారులను సిబ్బందికి ఆదేశించారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సిబ్బంది తహసీల్దార్ ప్రకాష్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలోని అంబాపురం, గోర్లగుట్ట, ఎం.పెండేకల్, గ్రామాల్లో రీసర్వే చేశామన్నారు. ఆ గ్రామాల నుంచి 120 మంది రైతులు భూసమస్యలపై అర్జీలు అందజేశారనీ, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో డీటీ మహేశ్వరరెడ్డి, మారుతి, మండల సర్వేయర్ నాగరాజు నాయక్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఘనంగా స్వాతి వేడుకలు


సహస్ర దీపాలంకరణ ఉత్సవంలో స్వామివారు

బేతంచెర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో స్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను అత్యంత వైభవంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి అనంతరం సహస్ర దీపాలంకరణ ఉత్సవం, ప్రకారోత్సవం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, అర్చకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టన్ను అరటి రూ.23 వేలు

- రైతుల్లో ఆనందం

రుద్రవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : టన్ను అరటి రూ.23 వేలు పలికింది. బుధవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో కూలీలు అరటి గెలలను లారీకి లోడు చేశారు. గతంలో రూ.15 వేల నుంచి రూ.18 వేలు పలికేది. ఒక్కసారిగా టన్నుకు రూ.5వేలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆలమూరు నుంచి ఢిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు అరటి గెలలను సరఫరా చేస్తున్నట్లు రైతులు మోహన్, హుసేనీ, మహ్మద్ తెలిపారు.

కుష్ఠు వ్యాధి సర్వే పరిశీలన

రుద్రవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాపురం గ్రామంలో నిర్వహించిన కుష్ఠువ్యాధి సర్వే కార్యక్రమాన్ని లెప్రసీ నివారణ జిల్లా వైద్యాధికారి తేజ శివానీ బుధవారం పరిశీలించారు. గ్రామంలో సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల జాబితా ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీఎంవో అక్కు, వైద్యాధికారి బాబు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి విశేష పూజలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ మండలం చిన్న కందుకూరు గ్రామంలో వెలసిన కాలభైరవ స్వామికి బహుళ అష్టమి సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన నిర్వహించారు.

వ్యవసాయంపై అవగాహన ఉండాలి

రుద్రవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలోనే వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తువ్వపల్లె గ్రామ సమీపంలో వరి పొలాల్లో 9వతరగతి విద్యార్థులు వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా వరి నాట్లు వేసే విధానం, పంటలు ఎలా పండుతాయనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ట్రైనర్ జ్యోతిప్రియ పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే

చాగలమర్రి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలంపాడు గ్రామంలో బుధవారం మండల సర్వేయర్ మద్దిలేటి ఆధ్వర్యంలో భూరీసర్వే పనులు ప్రారంభించారు. రీసర్వేలో భాగంగా పైలేట్ ప్రాజెక్టు కింద నేలంపాడు గ్రామాన్ని ఎంపిక చేశారని తెలిపారు. గ్రామంలో 1,700 ఎకరాల భూములకు రీసర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వీఆర్వో శ్రీనివాసులు, వీఎస్ వరప్రసాద్, శెట్టివీడు, గొడిగనూరు, మద్దూరు గ్రామాలకు చెందిన సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

అంబాపురంలో కంది పంట కోత ప్రయోగం

బేతంచెర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాపురం గ్రామంలో కంది పంట కోత ప్రయోగం బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా కొత 10/10 విస్తీర్ణాన్ని కంది పంటను కోశారు. అనంతరం ఒక ఎకరా పొలాన్ని యూనిట్‌గా తీసుకుని వచ్చిన పంటకు తూకం వేయగా.. 2,920 కేజీలు కంది పంట వచ్చింది. కార్యక్రమంలో నేషనల్ శాంపుల్ సర్వే అధికారి సాంబశివుడు, బేతంచెర్ల మండల సహాయక గణాంకఅధికారి దేవదాసు, వీహెచ్‌ఏ సుధాకర్, ఇన్సూరెన్స్ అధికారి కళ్యాణ్, వీఆర్ఏ పుల్లన్న, రైతులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పశువుల పెంపకందారులు అప్రమత్తంగా ఉంటూ వ్యాధులు సోకిన వెంటనే పశువులకు చికిత్సలు చేయించాలని చాగలమర్రి పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని చింతలచెరువు, కేపీ తండా గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సాయిబాబా, దీపకుమారి, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

చాగలమర్రి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. బుధవారం మండలంలోని కొలుములపేట, చింతలచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు ఉమామహేశ్వరి, ఉపేంద్ర, ఏఈవో మంజుల, రైతులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి


ఆళ్లగడ్డలో డిగ్రీ విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగలింగారెడ్డి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నట్లు రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగలింగా రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ శారు. కళాశాలలోని రికార్డులు, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి విద్యాబోధన, మౌళిక సదుపాయాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంగన్న, అధ్యాపకులు నాగమస్తాన్, విజయలక్ష్మి, జయచంద్రుడు, వెంకటేష్, స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

రంగత్సోవ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ప్యాపిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని డైట్ కాలేజీలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి రంగత్సోవ పోటీల్లో ప్యాపిలి లక్ష్మిరెడ్డి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎనిమిది విభాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఐదు విభాగాల్లో ప్రతిభ కనపబరిచి జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారు. పూజ, రవితేజ, జస్వంత్, అరీఫ్ అహమ్మద్, జానకి విద్యార్థులు పోటీలో ప్రతిభ కనబరిచిన వారిలో ఉన్నారు. విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంజీవరెడ్డి, హెచ్‌ఎం ఇనాయతుల్లా, ఉపాధ్యాయులు రహంతుల్లా, వెంకటలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

నేడు మంత్రి బీసీ రాక

కోవెలకుంట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నేడు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పట్టణంలో పర్యటిస్తారని తహసీల్దారు పవన్‌కుమార్ రెడ్డి, ఈవోఆర్‌డి ప్రకాశ్‌నాయుడు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాడు రోడ్డు ప్రధాన రహదారిలోని జమ్మలమడుగు సర్కిల్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని, అలాగే బస్టాండు సమీపంలో ఏర్పాటు చేసిన సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అలాగే పలు అభివృద్ధి పనులకు స్థలాలను పరిశీలిస్తారన్నారు.

ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

కొలిమిగుండ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలు సాగు చేసిన పంటల నమోదుతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మనాయినిపేట, అబ్దులాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సస్యరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం పొలాల్లోకి వెళ్లి జొన్న, కంది పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో తిమ్మనాయినిపేట టీడీపీ నాయకులు గోపాల్, అబ్దులాపురం సర్పంచ్ నారాయణరెడ్డి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరం రేంజ్‌లో కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు

రుద్రవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం రేంజ్‌లో వన్యప్రాణుల గణంకాల్లో భాగంగా కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశామని రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంటు బీట్ ఆఫీసర్లు తమ పరిధిలో ఎప్పటికప్పుడు వన్యప్రాణుల గురించి సమాచారం సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. కెమెరా ట్రాప్‌లపై నిర్లక్ష్యం చేయవద్దని సిబ్బందిని రేంజ ర్ ఆదేశించారు.

జోగులాంబ సన్నిధిలో కోట్ల ప్రత్యేక పూజలు


అలంపూరు జోగులాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల దంపతులు

డోన్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా సమీపంలో ఉన్న అలంపూరు జోగులాంబ ఆలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలు ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాదు నుంచి కర్నూలుకు బుధవారం బయలుదేరి వస్తూ మార్గమధ్యలో అలంపూరు జోగుళాంబ ఆలయాన్ని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సతీసమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు కోట్ల దంపతులను సాదరంగా ఆహ్వానించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయానికి సంబంధించిన అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థికి చెక్కును అందిస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జనవరి22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన ఎ.జగదీశ్ అనే విద్యార్థి జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక అయ్యాడు. బుధవారం విద్యార్థిని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అభినందించారు. ఉత్తరాఖండ్‌లో జనవరి 27 నుంచి 31 వరకు జరుగనున్న జాతీయస్థాయి సీనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఏపీ తరుపున ఆడునున్నట్లు తెలిపారు. విద్యార్థికి బీసీ ఇందిరమ్మ నగదు అందించి పోత్సహించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


శశికళ భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

డోన్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో శ్రీసుధ విద్యాసంస్థల గౌరవ సలహాదారు శశికళ మృతికి డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సంతాపం తెలియజేశారు. బుధవారం డోన్‌లో శశికళ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోట్ల సుజాతమ్మ వెంట టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, ఓంప్రకాష్ తదితరులున్నారు. అలాగే టీడీపీ యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్ రెడ్డి శశికళ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

పలుకూరులో సీసీ రోడ్ల నిర్మాణం

బనగానపల్లె, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లను, కాల్వ పనులను పలుకూరు గ్రామ పంచాయతీ ఈవో బాలాంజనేయులు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ చాకలిహుసేని, టీడీపీ నాయకుడు వల్లపు శంకర్, సైకిల్‌షాపు బాష పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శానిటేషన్‌పై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రమణ కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో శానిటేషన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మరుగుదొడ్లు లేనివారిని గుర్తించాలని కోరారు. సమావేశంలో ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రేష్మా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, ఎన్ఆర్ఈఎస్ టీఏలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి

చాగలమర్రి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య, కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యం

అవుకు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు ఏపీ గిరిజన కో ఆపరేటీవ్ కార్పొరేషన్ డైరెక్టర్ అరణ్‌కుమార్‌నాయక్ అన్నారు. బుధవారం పశువైద్యాధికారి భారతీదేవితో కలిసి అవుకులో పశుఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిక్కన్న, వెంకటరాముడు నాయక్, పశువైద్య సిబ్బంది రాజేష్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈ బదిలీ

చాగలమర్రి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి విద్యుత్ కేంద్రంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న షాజహాన్ నంద్యాల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న విద్యుత్ ఏఈ షాజహాన్‌కు విద్యుత్‌శాఖ లైన్‌మెన్‌లు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, విద్యుత్ సిబ్బంది సన్మానించారు.